క్లుప్తంగా

నేడు మెగా మెడికల్ క్యాంప్

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్లకు మంగళవారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు చేయించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంప్ జరుగుతుందన్నారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారులు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో అన్నిరకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని మున్సిపల్ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుజన్ కుమార్ తెలిపారు. పేరు మార్పిడి కోసం ఒకటి, భూమి కొలతలకు మరొకటి, ఆన్‌లైన్ చేయడానికి ఇంకొకటి వచ్చినట్లు తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను వారం రోజుల్లోగా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

టపాసుల తయారీదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దిపాడు: మండలంలో టపాసులు తయారు చేస్తున్న వారు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై శివరామయ్య సూచించారు. మండలంలో టపాసులు తయారు చేసే వారిని సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. టపాసులు, క్రాకర్స్ తయారు చేసే క్రమంలో తయారీ ప్రాంతంలో నీరు నిల్వ చేసుకోవాలని, ఫైర్ డిపార్ట్‌మెంట్ నిబంధనలు పాటించాలని సూచించారు. తయారీదారుల లైసెన్సులు రెన్యువల్ చేయించారా.. లేదా..? అనే అంశాలను పరిశీలించారు. ఆయన వెంట క్రాకర్స్ తయారీ యూనిట్ల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి


సర్పంచ్ సుశీల (ఫైల్)

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం పీ తక్కెళ్లపాడు సర్పంచ్ ఆలూరి సుశీల (53) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసి సర్పంచ్‌గా గెలిచి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి స్థానిక ప్రజల ఆదరాభిమానాలు పొందారు. సర్పంచ్ మృతి చెందిన విషయం తెలుసుకుని స్థానిక నాయకులు ఆమె భర్త ఆలూరి వెంకటేశ్వర్లు, కుమారుడు ఆలూరి లక్ష్మీనారాయణను పరామర్శించారు. సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, వైస్ ఎంపీపీలు తన్నీరు రాగమ్మ, మండవ సులోచన, టీడీపీ మండల నాయకులు మద్దినేని హరిబాబు, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, పలు గ్రామాల నాయకులు, కార్యదర్శులు తక్కెళ్లపాడు చేరుకుని సుశీల మృతదేహానికి నివాళులర్పించారు.

రోడ్డు ఆక్రమణలను తొలగించండి

చీమకుర్తి: రోడ్డును ఆక్రమించుకుని నిర్మించిన ఇంటిని తొలగించాలని సంతనూతపాడుకు చెందిన సీహెచ్ అంకారావు పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు, డీపీఓ సూచనల మేరకు రోడ్డును ఆక్రమించుకుని ఇంటిని నిర్మించిన వీ భాగ్యలక్ష్మి, ఈశ్వరయ్యకు పంచాయతీ సెక్రటరీ నోటీసులు ఇచ్చినట్లు మీడియాకు అంకారావు తెలిపారు. 76 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో 46 అడుగుల రోడ్డును ఆక్రమించుకుని ఇంటిని నిర్మించటం వలన కేవలం 20 అడుగుల రోడ్డు మాత్రమే మిగిలి ఉందని, దానిలో కూడా కాలువలుపోతే మిగిలిన రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని అంకారావు తెలిపారు. తక్షణమే రోడ్డును ఆక్రమించుకున్న వారికి ఇచ్చిన నోటీసుల ప్రకారం ఇంటిని తొలగించాలని పంచాయతీ అధికారులను అంకారావు డిమాండ్ చేశారు.

బీజేపీ కుట్రలను దళితులు అర్థం చేసుకోవాలి

బేస్తవారిపేట: బీజేపీ కుట్రలను దళితులు అర్థం చేసుకోవాలని మాలమహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి అన్నారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా బేస్తవారిపేటలోని మాలమహానాడు కార్యాలయంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఎటువంటి పరిస్థితుల్లోనైనా అడ్డుకుంటామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి లోబడి ఉండాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అంబేడ్కర్ కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు కలిసికట్టుగా ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదమ్ముళ్ల మధ్యన చిచ్చుపెట్టి రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలో భాగంగానే వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పులు వెలువడ్డాయని తెలిపారు. బీజేపీ కుట్రలను దళితులు అర్థం చేసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. మాలమహానాడు జిల్లా నాయకుడు మంచా సాయి, సేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు, నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్‌బాబు, మండల నాయకులు అశోక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం కీలకం

- దానిపై అవగాహన పెంచుకోవాలి
- ఎంపీడీవో సుజాత



సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: సమాచార హక్కు చట్టంపై రైతులు, ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో పి.సుజాత సూచించారు. కొత్తపట్నంలోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు, రైతులతో సమాచారం హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ఎంపీడీవో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా పొందవచ్చన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సెక్షన్ 5(1) మేరకు పౌర సమాచార అధికారి ఉంటారని తెలిపారు. సమాచార చట్టంలో దరఖాస్తు రుసుం ఎలా చెల్లించాలనే విషయంతో పాటు చట్ట పరిధిలో సెక్షన్ల గురించి వివరించారు. 31 సెక్షన్‌పై అవగాహన కల్పించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 12-10-2005న ఆమోదంలోకి వచ్చిందని, ఈ చట్టాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అధికార యంత్రాంగంలో పారదర్శకత తీసుకురావడమని, అవినీతిని అరికట్టడమని, ప్రభుత్వం, వాటి విభాగాలు ప్రజలకు జవాబుదారిగా ఉండటమని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెయింటెనెన్స్ గ్రాంట్ విడుదల చేయాలి


బీటీఏ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సభ్యులు

కొత్తపట్నం: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి స్కూల్ గ్రాంటు, మెయింటెనెన్స్ గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని బీటీఏ సభ్యులు డిమాండ్ చేశారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం కొత్తపట్నం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి కొత్తపట్నం మండలంలోని వి. విధ పాఠశాలల్లో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ స్కూల్ గ్రాంటు, మెయింటెనెన్స్ గ్రాంటు గత మూడు సంవత్సరాల నుంచి విడుదల కాలేదని, దీని వల్ల ప్రధానోపాధ్యాయులు పాఠశాలను నిర్వహించడం చాలా కష్టంగా మారిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్కూల్ గ్రాంట్, మెయింటెనెన్స్ గ్రాంట్, స్కూల్ కాంప్లెక్స్ గ్రాంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీసం చాక్‌పీసులు కొనుక్కోవడానికి కూడా నిధులు లేవని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. బీటీఏ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవులు వెంటనే మంజూరు చేయాలని, గత మూడు సంవత్సరాల నుంచి సరెండర్ లీవుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కర్ర దేవసహాయం మాట్లాడుతూ ప్రాథమిక విద్యను అస్తవ్యస్తం చేస్తున్న జీవో ఎంఎస్ నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నన్నేసాన్ని భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కొప్పోలు కిషోర్ కుమార్, ట్రెజరర్ చెక్క కోటేశ్వరరావు, చిటితోటి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి తోడ్పడుతుందని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ అన్నారు. జేవీవీ మండల నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, బీ ఆంజనేయులు, చలువాది రమేష్‌తో కలిసి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహణ విధానాన్ని డాక్టర్ బీ జవహర్ నివాసంలో సోమవారం తెలిపారు. ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబర్-1న మండల స్థాయిలో, అక్టోబర్-27న జిల్లా స్థాయిలో, నవంబర్-9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో టాలెంట్ టెస్ట్ జరుగుతున్నట్లు తెలిపారు. హైస్కూలులో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనేందుకు అర్హత కలిగిన వారని చెప్పారు. ప్రతి హైస్కూలు స్థాయిలో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

మార్కాపురం చెరువుకు మోక్షమెప్పుడో?


కొద్దిపాటి నీరున్న మార్కాపురం చెరువు


గుర్రపుడెక్క చిల్లచెట్లతో మూసుకుపోయిన కాలువ

- పూడుకుపోయిన చెరువు కాలువలు
- ఈ ఏడాది చెరువు కింద ఆయకట్టు సాగు శూన్యం
- గత ప్రభుత్వంలో 15 కి.మీ కాలువ బాగు చేసినా సమస్య మళ్లీ మొదటికి..
- చెరువు, కాలువలు బాగు చేయాలని రైతుల వినతి

మార్కాపురం:

శతాబ్దాల చరిత్ర కలిగిన మార్కాపురం చెరువు రోజురోజుకూ పూడుకుపోతోంది. పట్టణంలో ఉండే చెత్తా చెదారం, గుర్రపుడెక్క ఆకుతో అటు కాలువలు, ఇటు చెరువు పూడిపోయి పల్లెంలా తయారైంది. సుమారు 25 ఏళ్ల క్రితం 15 అడుగుల లోతున ఉన్న చెరువు, ప్రస్తుతం 5 అడుగులకు వచ్చింది. అధికారికంగా చెరువు కింద సుమారు 2 వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా, అనధికారంగా మరో వెయ్యి ఎకరాలు సాగు చేస్తారు. గతేడాది కొంత మంది రైతులు చెరువులో ఉన్న నీటిని వినియోగించుకుని వివిధ రకాల పంటలు పండించారు. ఈ ఏడాది చెరువుకు సరిపడినంత నీరు చేరకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమైంది. మార్కాపురం చెరువులో నీరుంటే రైతులు వరి సాగు చేసేవారు. కానీ ఈ సారి మెట్టపంటలు కూడా సాగు కాలేదు. మార్కాపురం చెరువులో నీళ్లుంటేనే పట్టణంలో డీప్ బోర్లు రీచార్జ్ అయి నీరు వస్తాయి.

సమస్య మళ్లీ మొదటికి..

కంభం చెరువు నుంచి వచ్చే నీరు మార్కాపురం మండలం మాల్యవంతునిపాడు వద్ద రెండు పాయలుగా చీలుతుంది. ఒక కాలువ మార్కాపురం చెరువుకు, మరో కాలువ గుండ్లకమ్మతోపాటు వేములకోట చెరువుకు వెళ్తుంది. సుమారు 15 కిలోమీటర్లు ఉన్న కాలువను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు వెచ్చించి బాగు చేయించారు. అయితే ఇటీవల వచ్చిన వర్షాలకు కాలువలో చెత్తాచెదారం చేరడం, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో కాలువలు పూడిపోయి, నీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. దీంతో వరద నీరంతా గుండ్లకమ్మలో చేరి వృథాగా సముద్రంలో కలిసిపోయింది. మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాలైన రాయవరం, మేకలవారిపల్లి, చెన్నరాయునిపల్లి తదితర గ్రామాలకు చెందిన వారు తమ పాత ఇళ్లు పడగొట్టి కొత్తఇల్లుకట్టే సమయంలో ఆ వ్యర్థాలను చెరువు అంతర్భాగంలో తెచ్చి పోస్తున్నారు. దీంతోపాటు జంతు కళేబరాలు, ఇళ్ల నుంచి వచ్చే చెత్తను సప్లయ్ చానల్, కాలువల్లో పడేస్తున్నారు. ఫలితంగా చెరువుకు నీరు చేరడం కష్టమై సాగు ప్రశ్నార్థకంగా మారింది. మాల్యవంతునిపాడు నుంచి వచ్చే చెరువు సప్లయ్ చానల్ వెంట పలువురు ఇళ్లు నిర్మించడంతో క్రమక్రమంగా కాలువ కుంచించుకుపోయింది. కాలువకు ఇరువైపులా భారీగా చిల్లచెట్లు, తుమ్మచెట్లు మొలిచాయి. నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి కాలువలతోపాటు చెరువులో మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన


బేస్తవారిపేట : క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో సత్తాచాటారు. ఈనెల 21, 22వ తేదీల్లో గిద్దలూరులో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనపరచారు. బీవీ రవీంద్ర 100 మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్, ట్రిపుల్‌జంప్ పోటీల్లో మొదటి స్థానం, ఎస్.రవితేజ 200, 1500 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ, జె.మురళీకృష్ణ ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటారు. గెలుపొందిన విద్యార్థులను, పీడీ మధుసూదనచార్యులును పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ఒంగోలు టౌన్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి ఉండి, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆధార్ కార్డు కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటుగా వసతి సౌకర్యం కలగజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు పూర్తి వివరాల కోసం 9492583484 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాల్సిందిగా కోరారు.

చెన్నకేశవస్వామి హుండీ ఆదాయం రూ.10.68 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి హుండీ కానుకల రూపంలో రూ.10,68,797 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు సోమవారం తెలిపారు. చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారి హుండీల ద్వారా 4 నెలల 13 రోజులకుగాను ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కించేందుకు మహిళా భక్తులు, ఆలయ సిబ్బంది సహకరించారని అధికారులు తెలిపారు.

ఎన్‌సీసీకి 35 మంది విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజబాబు తదితరులు

మార్కాపురం టౌన్: డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ సెలక్షన్‌లో 35 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ ఏఎన్‌ఓ 186 యూనిట్ కెప్టెన్ అనీల్ నేతృత్వంలో 2024-25 విద్యాసంవత్సరానికి సెలక్షన్ నిర్వహించారు. మొత్తం 100 మంది విద్యార్థులు సెలక్షన్‌కు హాజరుకాగా 35 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. వీరిలో 27 మంది విద్యార్థులు, 8 మంది విద్యార్థినులు ఉన్నట్లు వివరించారు. కమాండింగ్ ఆఫీసర్ మోహన్, ఆంధ్రా బెటాలియన్ అధికారులు సత్యనారాయణ్, సిబ్బంది పుష్పరాజ్, అకడమిక్ డీన్ మస్తానయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్

- గాంధీ వేషధారణలో యాచిస్తున్న చిన్నారులు, వారి కుటుంబ వివరాలు సేకరణ
- నిరాశ్రయుల భవనంలో వసతి కల్పన


యాచకుల కుటుంబ వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: కలెక్టర్ తమీమ్ అన్సారియా మానవత్వం చాటుకున్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం భవనానికి వస్తున్నప్పుడు స్థానిక చర్చిసెంటర్‌లో బతుకుదెరువు కోసం సుమారు ఆరేళ్ల వయసు గల ఇద్దరు చిన్నారులు గాంధీజీ వేషధారణలో యాచిస్తుండటం, పక్కన వారి కుటుంబ సభ్యులు ఉండటాన్ని చూసి చలించిపోయారు. వారందరినీ కలెక్టరేట్‌కు పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. గాంధీజీ వేషం వేసిన చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమది అనంతపురం జిల్లా గుంతకల్లు అని తెలిపారు. తాను వికలాంగుడినైన కారణంగా ఇలా చిన్నారులతో భిక్షాటన చేయించాల్సి వస్తుందని చిన్నారుల తండ్రి తెలిపారు. వారి కుటుంబంలో ఒక భర్త చనిపోయిన మహిళ, కౌమార దశలో ఉన్న బాలిక కూడా ఉన్నారు. జాయింట్ కలెక్టర్ కూడా అదే సమయంలో అక్కడికి రావటంతో వారందరి పూర్తి వివరాలు సేకరించారు. ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ రవికుమార్‌ను పిలిచి ఆ రెండు కుటుంబాలను తక్షణమే రిమ్స్ ప్రాంగణంలోని పట్టణ నిరాశ్రయుల భవనానికి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త దుస్తులు ఇప్పించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. పసిపాపకు వ్యాక్సినేషన్ చేయించాలని చెప్పారు. అనంతరం వారిని ఆటోలో జీజీహెచ్‌కి తరలించి వైద్య పరీక్షలు చేయించి నిరాశ్రయుల భవనంలో వసతి కల్పించారు. నూతన దుస్తులు, వికలాంగుడికి ఒక వీల్‌చైర్ కూడా అందజేశారు.

నేడు వారాహి మహారథ యాత్ర

ఒంగోలు మెట్రో: ఆదివారాహిశక్తి ఆలయం ఆధ్వర్యంలో తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు నిర్వహిస్తున్న శ్రీ వారాహి అమ్మవారి మహారథయాత్ర మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఒంగోలు నగరం చేరుకుంటుందని శ్రీశ్రీశ్రీ మహారుద్రస్వామి తెలిపారు. నగరంలోని కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ వినాయక గుడి వద్ద నుంచి నెల్లూరు బస్టాండ్ డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్ వరకు సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపలో వారాహి ఉపాసకుడు మహారుద్రస్వామి వారాహి అమ్మవారి విశిష్టతను వివరిస్తారన్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్లో భక్తులచే సామూహికంగా వారాహి అమ్మవారి యాగం నిర్వహిస్తారన్నారు. మహారథ యాత్ర, యాగంలో నగర ప్రజలు పాల్గొని వారాహి అమ్మవారి ఆశీసులు అందుకోవాలని మహారుద్రస్వామి కోరారు.

నేషనల్ సెమినార్‌కు ఏకేయూ ఆక్వాకల్చర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపకులపతి మూర్తి

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రకేసరి యూనివర్సిటీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నాలుగు రోజుల పాటు కేరళ రాష్ట్రంలోని కొట్టాయం యూనివర్సిటీలో జరిగే జాతీయ సదస్సుకు హాజరుకానున్నారు. జాతీయ సదస్సుకు వెళ్తున్న విద్యార్థులను సోమవారం ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అభినందించారు. ప్రతిష్టాత్మకమైన కొట్టాయం సైన్స్ యూనివర్సిటీలో సదస్సుకు విద్యార్థులు వెళ్లడం శుభపరిణామం అని ఆయన అన్నారు. సదస్సులో విద్యార్థులు మంచి ప్రతిభ చాటి యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నాయకత్వం వహిస్తున్న ఏకేయూ ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ సురేష్, అశ్వర్థ నారాయణ, తదితరులకు సలహాలు, సూచనలు చేశారు.

స్వేచ్ఛ మనిషికి హాని కలిగించేలా ఉండరాదు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కంభం: స్వేచ్ఛ మానవులకు అవసరమే కానీ అది సమాజానికి హాని కలిగించేలా ఉండకూడదని జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆఫీరా పేర్కొన్నారు. నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో వాల్ పోస్టర్లు ఆవిష్కరించి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫీరా మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువతీ యువకులు నగ్నత్వం, జూదం, మద్యం, మద్యం, మాదక ద్రవ్యాలు, సహజీవన సంబంధాలు, స్వలింగ సంపర్కం, వ్యభిచారం లాంటి వాటికి ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే తమ సంస్థ ద్వారా యువతీ యువకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరీమున్నిసా, సాబిహా, అజీమా, తబస్సుమ్, మహబున్నీ,నసీమా,రమీజా, ఫర్జానా పాల్గొన్నారు.

మీ కోసం కార్యక్రమానికి అధికారులు డుమ్మా


కొమరోలులో మీ కోసం కార్యక్రమానికి హాజరైన అధికారులు

కొమరోలు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. మీ కోసం కార్యక్రమానికి కేవలం ముగ్గురు లేదా నలుగురు అధికారులే హాజరు కావడం, మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, హౌసింగ్ అధికారి మాత్రమే సోమవారం మీ కోసం కార్యక్రమానికి హాజరయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి మీ కోసం కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒంగోలు-కరవది మధ్య రైల్వే ఆర్‌ఓబీ

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర రైల్వే శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా నిర్మించ తలబెట్టిన పలు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించనుంది. దీనికి సంబంధించి కేంద్ర రైల్వేశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. దీని ప్రకారం ప్రకాశం జిల్లాలోని ఒంగోలు -కరవది స్టేషన్ల మధ్య లెవల్ క్రాసింగ్ నెం. 213 కి బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. దీని కోసం భూసేకరణ చేయనున్నారు.